

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

**మర్నాడు** క్లాస్‌లో సుసాన్ అడిగింది వాణిని ఆసక్తిగా.

"ఈసారి స్టేన్లీకి, నీకూ మధ్య ఏమైంది?"

జరిగింది వివరంగా చెప్పింది వాణి ఎక్సయిటెడ్‌గా.

"కంగ్రాట్స్ స్టడీ డేట్ దొరికినందుకు." చెప్పింది సుసాన్.

జూడీ అడిగింది వాణిని.

"నెక్స్ట్ వీకెండ్ ఇంటర్‌కోర్సులో పాల్గొంటున్నావా?"

"నాకు తెలీదు.. నో.. లేదు."

చిన్నగా నవ్వింది జూడీ.

"అది నీ చేతుల్లో లేదు. ఒకవేళ అదే జరిగితే, నువ్వు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి" హెచ్చరించింది జూడీ.

"ఎలాంటివి? అయినా అంతదూరం వెళ్ళం." చెప్పింది వాణి.

అమెరికాలో టీన్స్‌లోకి రాగానే అమ్మాయిలు ఇంటర్‌కోర్స్‌లో పాల్గొనడం సర్వసాధారణమైపోయింది. వాణికి తెలిసి ఆమె స్నేహితురాళ్ళలో సగం మందిదాకా కన్యత్వం కోల్పోయినవారే!

"నాలెడ్జ్ ఈజ్ పవర్. కాబట్టి విను. లూబ్రికెంట్స్ వాడు. మొదటి అయిదుసార్లు విసుగేస్తుంది తప్ప భూమి కంపించినట్లు, మెరుపులు మెరిసినట్లు అనిపించదు. తర్వాత క్రమంగా ఇంద్రధనస్సు దిగి వచ్చినట్లు, పగలే వెన్నెల కాసినట్లు అనిపిస్తుంది."

జూడీ చెప్పేది వినసాగింది వాణి.

"ముఖ్యంగా గుర్తుంచుకో. మొదటిసారి అయాక బ్లీడింగ్ అధికంగా ఉంటుంది. ఇంట్లో తెలిసేది ఆ బ్లీడింగ్ వల్లే. సేనిటరీ నేప్‌కిన్స్ ప్రత్యేకంగా కొనుక్కుని దాచి ఉంచు."

"ఏం?"

"సిల్లీ.. సేనిటరీ నేప్‌కిన్స్ ఎప్పటికన్న ఎక్కువగా ఖర్చవడంవల్లే మా అమ్మ జరిగింది గ్రహించి నాకు 'సేఫ్ సెక్స్' అనే పుస్తకం ప్రెజెంట్ చేసింది."

"నాకోసారి అదివ్వవా? చదివిస్తాను" అడిగింది వాణి.

"ష్యూర్. కాని రోజుకు క్వార్టర్ అద్దె" చెప్పింది. (క్వార్టర్ అంటే పాతిక సెంట్లు.)

"ఓ.కే. ఓ రోజులో చదివిచ్చేస్తాను."

"ఈ వీకెండ్‌లోగా ఇవ్వలేను. ఇంకొకళ్ళకు అద్దెకిచ్చాను. వచ్చే మంగళవారం ఇస్తాను. ఓ.కే?"

"ఓ.కే" చెప్పింది వాణి.

కొద్ది క్షణాల మవునం తర్వాత చెప్పింది. జూడీ ప్రోత్సాహంగా.

"ఈ రోజుల్లో అంతా ఆ పని చేస్తున్నారు. మోటెల్ బెస్ట్. కార్లో వెనక సీట్‌లో ఊరి బయట అంటే ఒప్పుకోకు. నీవు ఫ్రీగా ఇస్తున్నప్పుడు మోటెల్ గది అద్దెకయినా ఖర్చుపెట్టాలి వాడు. తర్వాత ప్రెజెంట్స్ అంగీకరించకు. అప్పుడది అనుభవం లేదా ప్రేమకోసంకాక వ్యాపారం అనిపించుకుంటుంది."

ఆ విషయం మీద జూడీ మరికొన్ని సలహాలు చెప్పింది.

మళ్ళీ వీకెండ్ దాకా వాణికి ఎంతో ఉత్సాహంగా గడిచాయి రోజులు. తన స్నేహితురాళ్ళందరికీ తెలిసిపోయింది స్టేన్లీ తన స్టడీ డేట్ అని. అది వివాహానికి దారి తీయకపోయినా సరే, మిగతా వాళ్ళముందు వాణి ఇన్‌ఫీరియర్‌గా ఫీలవకుండా వుండటానికి ఉపయోగపడుతోంది.

ఆ వారంలో ఒక విషాద సంఘటన జరిగింది. జూడీ పెంపుడు కుక్క హోప్ మరణించింది. ఆరేళ్ళ వయసుగల ఆ డాల్మేషియన్ అంటే వాణి కెంతో ఇష్టం. వాళ్ళింటికెళ్ళినప్పుడల్లా దాంతో కొద్దిసేపు ఆడుకునేది. జూడీ ఫోన్ చేసి చెప్పిన అయిదు నిముషాలకే వాణికి ఏడుపొచ్చింది.

దాని ఫ్యునరల్‌కి వాణి కూడా హాజరయింది పెంపుడు కుక్కలను పాతిపెట్టడానికి అమెరికాలో శ్మశానాలుంటాయి. పాతడానికి సరిపడే ప్రదేశానికీ, టోంబ్‌స్టోన్‌కీ ఇంతని చెల్లించి ఆ శ్మశానాన్ని ఉపయోగించుకోవచ్చు. వాణి కూడా ఆ ఫ్యునరల్‌కి హాజరయింది. వెంకటేశ్వరరావు తీసుకెళ్ళాడు కారులో.

పేరుకు శ్మశానమే అయినా అది పచ్చటి లాన్స్‌తో, పూలమొక్కలతో పార్కులా వుంటుంది. వాతావరణం అంతా ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. కుక్కలు, పిల్లుల ఆకారాల్లో కత్తిరించి ఉన్నాయి. పచ్చటి ష్రబ్స్.

"మన ఇండియాలో మనుషుల శ్మశానం కూడా ఇంత శుభ్రంగా ఉండదు" చెప్పాడు వెంకటేశ్వరరావు.

అతను ఎప్పుడో కాని ఇండియా గురించి వ్యతిరేకంగా పిల్లల ముందు మాట్లాడడు. ఆయన అమెరికన్స్‌కి వ్యతిరేకంగా చాలా తరచుగా వ్యాఖ్యానిస్తుంటాడు. తమ పిల్లలకు చిన్నప్పటినుంచే అమెరికన్స్ అంటే మానసికంగా ద్వేషం కలగాలని అతను చేసే ప్రయత్నం అది. అందువల్ల పెద్దయ్యాక వాళ్ళు భారతీయులను తప్ప అమెరికన్స్‌ను చేసుకోరని అతని ఆశ.

జూడీ, జూడీ తల్లిదండ్రులు మిస్టర్ అండ్ మిసెస్ థాంప్సన్ కూడా ఏడిచార. హోప్ శరీరం పాతిపెడుతూంటే వాణికూడా. వెంకటేశ్వరరావు మాత్రం మనసులో నవ్వుకున్నాడు. కుక్క చస్తే బంధువులు పోయినట్లుగా ఈ ఏడుపేమిటని.

శుక్రవారం ఉదయం వాణి అభ్యర్థన మీద జూడీ వాణి ఇంటికి ఫోన్ చేసింది. లక్ష్మి ఫోన్ తీస్తే తనెవరో చెప్పింది.

"వాణిని మా ఇంటికి లంచ్‌కి పంపించండి." రిక్వెస్టు చేసింది.

"ఏమిటి విశేషం?" అడిగింది లక్ష్మి.

"మా ఇంట్లో గేరేజ్ సేల్. హెల్ప్ చేస్తుంది. సాయంత్రం ఆరున్నరకి పంపుతాం ఓకే?"

"ఓకే."

"థాంక్స్ ఎలాట్."

వాణి ఆ శనివారం స్టేన్లీతో వెళ్ళడానికి ముందే చేసుకున్న ఏర్పాటు అది. శనివారం బ్రేక్‌ఫాస్ట్ స్టేన్లీతో చేయాలి కాబట్టి వాణి ఇంకో అబద్ధం చెప్పింది తల్లితో

"మమ్! బిగ్‌మేక్ తినాలని ఉంది. బ్రేక్‌ఫాస్ట్ దారిలో చేస్తాను. జూడీ వాళ్ళ నాన్న నన్ను అక్కడే పికప్ చేస్తాడు."

అయిదు డాలర్ల నోటిచ్చి చెప్పింది లక్ష్మి. "మిగిలిన చిల్లర తెచ్చివ్వు."

"అలాగే ఏపిల్ పై, బిగ్‌మేక్, కోక్ నా బ్రేక్‌ఫాస్ట్. థాంక్స్ మమ్."

లక్ష్మి కూతుర్ని మెక్‌డొనాల్డ్ రెస్టారెంట్ దగ్గర కార్లో దింపి వెళ్ళిపోయింది. బయటే ఎదురు చూసింది వాణి. ఇరవై నిమిషాల తర్వాత స్టేన్లీ కారు వచ్చింది. కార్లోంచి దిగిన స్టేన్లీ వంక చూసి చేతిని ఊపి చెప్పింది.

"హాయ్!"

"హాయ్!"

కారు పార్కు చేసి వాణి నడుం చుట్టూ తన చేతిని పోనిచ్చి ముద్దుపెట్టుకున్నాడు. కొద్ది క్షణాల తర్వాత ఇద్దరూ లోపలికి నడిచారు.

వేడి వేడి ఏపిల్ పై తిన్నారు.

"ఒక్క బిగ్‌మేక్ చాలు."

దాన్ని ఇద్దరూ కలిసి తిన్నారు. తర్వాత ఆరెంజ్ జ్యూస్ తాగారు. ప్లాస్టిక్ ట్రేలోని పేపర్ కప్పులు, ప్లేట్స్‌ను ఆ రెస్టారెంట్‌లో ఉన్న ఓ చెత్తబుట్టలో పడేసి ఆ పదార్థాలు తెచ్చుకున్న ప్లాస్టిక్ ట్రేని ఓ చోట ఉంచారు. టిష్యూ పేపర్‌తో చేతులు తుడుచుకున్నాక స్టేన్లీ బ్లాక్ కాఫీ తాగాడు.

అక్కడనించి షాన్ బొటానికల్ గార్డెన్‌కి చేరుకున్నారు. నూట ముప్పై అయిదేళ్ళ వయసున్న ఆ గార్డెన్‌కి వాణి ఈడున్న జంటలు అనేకమంది వచ్చారు. 'ఫిష్ ఫీడ్' అని రాసి ఉన్న డబ్బాలో వాణి చిల్లర వేసి బయటికి వచ్చిన ఫిష్ ఫీడ్ తీసుకుంది. చెరువుమీది వంతెన మీంచి నీళ్ళలో వేసింది. చేపలు ఈదుకుంటూ వచ్చి వాటిని నీళ్ళలో పడగానే తినసాగాయి.

ఆ తర్వాత రోజ్ గార్డెన్స్, జపనీస్ గార్డెన్, ఇంగ్లీష్ ఉడ్ గార్డెన్, హెర్బ్ గార్డెన్ తిరిగి చూశారు. ప్రతీ గార్డెన్‌లో స్టేన్లీ వాణిని ముద్దుపెట్టుకుంటూనే ఉన్నాడు.

మధ్యాహ్నం అయ్యాక అద్దాల గోడల మధ్య గ్లాస్ డోమ్ కింద, కంట్రోల్ వాతావరణంలో పెంచే ట్రాఫిక్ చెట్లున్న హెర్బేరియంలోకి వెళ్ళారు. కొన్ని వందల రకాల చెట్లున్నాయి. అవన్నీ ట్రాపికల్ ఏరియాల్లో పెరిగేవే. అరటి చెట్లని చూపించి చెప్పింది వాణి స్టేన్లీకి.

"మా ఇండియాలో మా నాన్నగారి ఊళ్ళో పెరట్లో ఇవి చాలా ఉన్నాయి. ఆ ఆకుల్లో అన్నం తింటారక్కడ."

"హౌ ఇంట్రెస్టింగ్?... మీ భోజనంలో ఏం ఉంటాయి?" అడిగాడు.

వాణి తను రోజూ తినే పదార్థాల గురించి వివరించింది.

"ఓ రోజు మా ఇంటికి డిన్నర్‌కి ఆహ్వానిస్తాను." చెప్పింది.

స్టేన్లీ వాణి చేతిని నొక్కి చెప్పాడు.

"మీ వాళ్ళను చూడాలని నాకూ కోరికగా ఉంది. బట్ నో ఆవక్కాయ్ ప్లీజ్.." చెప్పాడు. వాణి దాని కారం గురించి చెప్పడంతో.

"ఈ తమాషా చూడు" చెప్పాడు స్టేన్లీ ఓ చెట్టు దగ్గరకు రాగానే.

పక్కనే వున్న కాలువలోని నీళ్ళను దోసిళ్ళతో పట్టి ఆ చెట్టు నుంచి పొడుచుకు వచ్చిన ఊడలు ముందు ఉంచితే ఆ ఊడలు ఆ నీళ్ళను పీల్చుకున్నాయి.

వాణి కూడా అలా చేస్తే ఆ ఊడలు నీళ్ళను తాగాయి.

"ఇలాంటి చెట్లు మీ ఊళ్ళో ఉన్నాయా?" అడిగాడు స్టేన్లీ.

"లేవు. నేనెప్పుడూ చూడలేదు. వినలేదు కూడా"

"వాటి కాండాన్ని నొక్కి చూడు."

వాణి నొక్కితే తనకి దాహంగా ఉందనీ, నీళ్ళు తాగించమనీ కోరిందాచెట్టు. ఆ మాటలు విన్నాక కానీ వాణికి అర్థం కాలేదు ఆ చెట్టు కృత్రిమమైనదని. ఊడలు నీళ్ళు పీల్చుకోవడం, చెట్టు మాట్లాడడం సరదాకోసం శాస్త్రజ్ఞులు ఏర్పాటు చేశారని.

షాన్ గార్డెన్ చుట్టూ తిరిగి చూడటానికి అనువుగా ఉన్న రైల్లో ప్రయాణించి చూశారు. దారిలో ఓ ఫౌంటెన్‌లో అతి పెద్ద తామరాకుల్లాంటి ఆకులున్నాయి. వాటిని చూపించి చెప్పాడు స్టేన్లీ.

"అవి ఎంత బలమైన ఆకులంటే వాటిమీద చిన్నపిల్లల్ని కూర్చోపెట్టినా మునగవు. గంటకో అంగుళం చొప్పున పెరుగుతాయి."

"నో కిడ్డింగ్?" అడి గింది వాణి.

"నో కిడ్డింగ్. నిజమే చెపుతున్నాను"

సాయంత్రం ఆరున్నరదాకా బొటానికల్ గార్డెన్ లో గడిపాక కారులో తిరిగి బయలుదేరారు.

"కారు ఎక్కడయినా ఆపనా? అడిగాడు స్టేన్లీ దారిలో.

"ఎక్కడ?"

"మనిద్దరం ఒంటరిగా ఉండే ఎక్కడయినా"

"ఎందుకు?"

"ఎందుకేమిటి? వి విల్ హేవ్ సమ్ ఫన్" నవ్వాడు.

"నో" చెప్పింది వాణి. అతను తన నుంచి సెక్స్ కోరుతున్నాడని వాణి గ్రహించగానే అప్రయత్నంగా ఆమె బుగ్గలు ఎర్రబడ్డాయి.

"ఇట్ విల్ బి ఏ లాటాఫ్ ఫన్ బేబీ!"

"నో ప్లీజ్"

"కమాన్ కిడ్ ఎవరితోనో ఒకరితో, ఎప్పుడో ఒకప్పుడు అది నీవు చేయాల్సిందేగా? డేష్ బోర్డు తీసి చూడు"

వాణి అతని కారు డేష్ బోర్డు తీసి చూస్తే అందులో కండోమ్స్ పేకెట్స్ కనపడ్డాయి.

"అమెరికా ఫోర్డ్ కార్లకి ఎలా ప్రసిద్ధో అలాగే అమెరికన్ కార్ల వెనక సీట్లు తొలి అనుభవాలకి ప్రసిద్ధి" నవ్వాడు తన ఎడమచేతిని ఆమె భుజాలమీదికి పోనిస్తూ.

"నో స్టేన్లీ"

"ఎందుకని?"

"పెళ్ళయ్యేదాకా ఆగాలి అది ఇండియన్ సంప్రదాయం."

"కానీ నువ్వు అమెరికన్‌వి"

"కాని నా తల్లిదండ్రులు వాళ్ళు నాకిచ్చిన శిక్షణ అంతా ఇండియన్స్ సంప్రదాయానికి సంబంధించినది. నో పెళ్ళయ్యేదాకా నో"

భుజాలెగరేశాడు ఓసారి.

''నిన్ను బలవంతం చేయను''

''పైగా నాకు భయంకూడా. తొలిసారి బాధగా ఉంటుందని''

''బాధ కలగకుండా చూసే పూచీ నాది''

''నో ప్లీజ్''

''నీ ఈడు పిల్లల్లా ఎందుకు ప్రవర్తించవు?'' అతని కంఠంలో కొద్దిపాటి తీవ్రత ధ్వనించింది.

''నేను పూర్తిగా అమెరికన్‌ని కాను కాబట్టి''

''హేవ్ ఇట్ యువర్ ఓన్ వే''

కారును రోడ్డుమీంచి ఓ దారిలోకి తిప్పాడు.

''ఇటెటు?'' అడిగింది వాణి భయంగా.

బదులుగా చిన్నగా నవ్వాడు. కానీ జవాబులేదు. దారిలో వే టు 'బేల్స్ మోటెల్' అనే బోర్డు కనిపించింది. వాణి చచ్చినా ఒప్పుకోదలచుకోలేదు.

కారు రెండు కిలోమీటర్లు వెళ్ళాక ఓ మైక్రోఫోన్ పక్కన ఆపాడు కారును. దాని స్విచ్ నొక్కి చెప్పాడు.

''వన్ చికెన్ పిజ్జా, టూ బ్లాక్ టీ ప్లీజ్'' అది ఆ మోటెల్‌కి అనుబంధంగా ఉన్న రెస్టారెంట్‌కి చెందిన మైక్రోఫోన్. కారులో కూర్చుంటే మాట్లాడేందుకు వీలయిన ఎత్తులో ఉన్న ఆ మైక్రోఫోన్‌లో కావాల్సినవి ఆర్డర్ ఇచ్చి ఆ రెస్టారెంట్ దగ్గరకి వెళ్ళేసరికి ఆ ఆర్డర్ తయారై పేక్ చేయబడి సిద్ధంగా ఉంటాయి. డబ్బు చెల్లించి తీసుకోవడమే తరువాయి. టైం సేవ్ చేయడానికి ఆ ఏర్పాటు.

''వాణీ! ఇంకోసారి ఆలోచించుకో. కారులో వద్దు. కాని ఈ మోటెల్ గదిలో ఓ గంట గడుపుదామా? ఏ రూమ్ విత్ ఏ టచ్ ఆఫ్ క్లాస్''

''నో స్టేన్లీ. ప్లీజ్'' చెప్పింది వాణి.

''ఓకే!''

కారు రెస్టారెంట్ కౌంటర్ పక్కన ఆపి తన ఆర్డర్ నెంబర్ చెప్పి, డబ్బు చెల్లించి పేపర్ కార్డ్‌బోర్డు బాక్స్‌ని అందుకున్నాడు.

''హేవ్ ఏ నైస్ డే'' చెప్పిందా కౌంటర్‌లోని అమ్మాయి చిల్లర అందిస్తూ చిరునవ్వుతో.

అమెరికా అంతటా సేల్స్‌మేన్, సేల్స్ గర్ల్స్ వెళుతున్న కస్టమర్స్‌కి ఆ మాటలు చెప్పడం ఆనవాయితీ.

కారు మళ్ళీ మెయిన్ రోడ్ మీదికి వచ్చాక ఊపిరి పీల్చుకుంది వాణి.

కారు నడుపుతూనే తినసాగాడు. టీ తొణికి కింద పడకుండా వుండే ఏర్పాటుగల ప్లాస్టిక్ ట్రే ఎవే గ్లాస్‌లోంచి తాగసాగాడు.

వాణి కారులోని రేడియోని ఆన్ చేసి మ్యూజిక్ వినసాగింది.

కారు వాణిని దింపాల్సిన ప్రదేశం సమీపిస్తుండగా స్టేన్లీ చెప్పాడు.

''డోంట్ యు వర్రీ. ఐయామ్ నాట్ హర్ట్''

''థాంక్స్ ఫర్ బీయింగ్ అండర్ స్టాండింగ్''

''వాణీ గుడ్‌బై''

అతని పెదాలని అంటీ అంటనట్లుగా కిస్ చేసి కారు దిగి చెప్పింది ''థాంక్స్ ఫర్ ది లవ్లీ టైమ్, స్టేన్లీ''

''వెల్ కం బేబీ''

వాణి ఇంటివైపు నడిచింది. ఇంట్లో వాతావరణం చాలా సీరియస్‌గా ఉండటం గమనించింది.

"ఎక్కడికి వెళ్ళావు?" అడిగింది లక్ష్మి వాణిని.

"బొటానికల్ గార్డెన్స్‌కి ఏం?"

"ఎక్కడికి వెళుతున్నానని చెప్పి వెళ్ళావు?" రెండో ప్రశ్న తీవ్రంగా వచ్చింది.

"జూడీ ఇంటికని కాని మెక్ డోనాల్డ్స్‌లో"

"... స్టేన్లీ కలిసి పిలిస్తే బొటానికల్ గార్డెన్స్ కి వెళ్ళావు. అంతేనా?" కోపంగా అడిగింది వాణి తల్లి లక్ష్మి.

"అంతే!"

"నీ వయసులో నేను ఎలా ఉండేదాన్నో చెప్పానా? నువ్వెలా నడుచుకోవాలో చెప్పానా లేదా?" తీవ్రంగా అడిగింది లక్ష్మి వాణిని.

"నీ మాటలు నాకర్థం కాలేదు?" చెప్పింది వాణి జరగబోయే గొడవను ఊహిస్తూ.

"మిసెస్ సుహాసినీ చౌదరి చెప్పింది నాకు. నువ్వూ, స్టేన్లీ క్రైమ్‌టోరియంలో ముద్దు పెట్టుకోవడం చూసినవారు చెప్పారని."

"ఎస్, వి ఆర్ డేటింగ్"

అంతదాకా మౌనంగా ఉన్న వెంకటేశ్వరరావు వాణి చెంపఛెళ్ళుమనిపించాడు.

వాణి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే అరిచింది తెలుగులో - "నేనేం తప్పు చేశానని నన్ను కొట్టారు?"

"డేటింగ్. అదీ అమెరికన్‌తో. అది తప్పుకాదా?" అడిగింది లక్ష్మి.

"ఎందుకవుతుంది?"

"మీ టినేజర్స్ డేటింగ్ అంటే ఏమిటో నాకు తెలుసు కాబట్టి?" చెప్పాడు వెంకటేశ్వరరావు కోపంగా.

"సుసాన్, జుడీ, కేథరిన్, లిండా, కేటి, కేథీ.. నా స్నేహితురాళ్ళంతా డేటింగ్ చేస్తుంటే తప్పులేదు కానీ, నేను చేస్తే తప్పా?"

"నీవు పెళ్ళి చేసుకోవాల్సింది ఇండియన్‌ని కాని, స్టేన్లీలాంటి అమెరికన్‌ని కాదు."

"నేను ఎవరిని పెళ్ళి చేసుకోవాల్సిందీ నిర్ణయించుకునేది నేను కాని, మీరు కాదు" అదే తీవ్ర స్థాయిలో చెప్పింది వాణి.

వాణి నుంచి అలాంటి సమాధానం ఎదురుచూడని వెంకటేశ్వరరావు, లక్ష్మి నిర్ఘాంతపోయారు. క్షణాల్లో తేరుకున్నారు.

"నేను చెప్పానా దీనికి పొగరెక్కిందని" చెప్పింది లక్ష్మి తన భర్తతో.

"మా అమ్మ, మీ నాన్నను చేసుకోమంటే చేసుకున్నాను. కానీ నా అంతట నేనే నిర్ణయించుకోలేదు, తెలుసా?" అరిచింది లక్ష్మి.

"నీవు మాట్లాడేది కొన్ని వేల మైళ్ళ దూరంలో వున్న దేశం గురించి. కానీ నేనక్కడ లేను. నేనున్నది ఇక్కడ అమెరికాలో" చెప్పింది వాణి.

"ఇక్కడ ఉన్నా మనం అక్కడివాళ్ళం. అక్కడి సంప్రదాయాలే మనం పాటించాలి."

"ఎందుకని?"

"ఎందుకంటే మనం ఎప్పటికయినా అక్కడికి వెళ్ళేవాళ్ళం కాబట్టి" చెప్పాడు వెంకటేశ్వరరావు.

"అబద్ధం. నువ్వు చెప్పినదాంట్లో ఒక్క అక్షరం నమ్మను నేను"

"అబద్ధం కాదు, నేను హైదరాబాదులోని శ్రీనగర్ కాలనీలో ఇల్లుకూడా కొన్నానని నీకు తెలుసు."

"అది పెట్టుబడి. ఇండియా వెళ్ళినప్పుడల్లా డాలర్లు ఖర్చుకాకుండా రూపాయల్లో కర్చు చేయడానికి చేసిన పెట్టుబడి తప్ప, మీరు వెనక్కి తిరిగివెళ్ళి ఉండటానికి కాదు. మీరు అమెరికా వదిలి ఇండియా వెళ్ళడం పైప్ డ్రీమ్."

"కాదు, వెళతాం"

"మీరు వెళ్ళినా నేను రాను" చెప్పింది వాణి.

"ఎందుకు రావు?" అడిగింది వాణి.

"ఎందుకంటే ఇండియా ఈజ్ డ.." తమాయించుకుని వాక్యం పూర్తిచేయకుండా చెప్పింది మళ్ళీ. "ఎందుకంటే నేను అమెరికన్‌ని కాబట్టి"

"మీ నాన్న ఇండియన్. మీ అమ్మ ఇండియన్. నీవూ ఇండియన్‌వి" అరిచింది లక్ష్మి.

"నో! నేను పుట్టింది అమెరికాలో, పెరిగింది అమెరికాలో. నా స్నేహితులున్నది అమెరికాలో నాకు తెలిసింది అమెరికన్ సంప్రదాయం. నేను చూసేది అమెరికన్ సంప్రదాయం మీరు ఇండియాలో పుట్టారు కాబట్టి మీరు నేర్చుకున్నది ఇండియన్ సంప్రదాయం కాబట్టి అక్కడిలా మీరుండండి. అంతేకాని ఈ ప్రపంచంలోని, నాకు తెలియని ఓ మారుమూల ప్రదేశంలో వాళ్ళు వుండేలా మీరక్కడ పుట్టి పెరిగిన పాపానికి నన్నలా ఉండమని ఆదేశించకండి. నేనున్న సమాజమే నాకు ముఖ్యం" చెప్పింది వాణి కోపంగా.

"మేము చెప్పినట్లు వినాల్సిందే"

"నేను మీలా ఉండాలని ఉన్నప్పుడు మీరెందుకు యిక్కడికి వచ్చారు? మీరు నన్నెందుకు ఈ దేశంలో కన్నారు? కన్నా నన్నీ దేశంలో ఎందుకు పెంచారు? నా చిన్నప్పుడే ఇండియా పంపించాల్సింది నో నేను ఇండియన్స్‌కే పుట్టి ఉండవచ్చుగాక. కాని నేను అమెరికన్‌ని"

వాణి అలా ఎదురు తిరుగుతుందని చూడని వెంకటేశ్వరరావు, లక్ష్మి ఒకరి మొహాలు మరొకరు విభ్రాంతిగా చూసుకున్నారు.

"ఈ రోజు నుంచి నీవు నా అనుమతి లేకుండా నీ స్నేహితులతో బయటికి వెళ్ళడానికి వీల్లేదు" అరిచాడు వెంకటేశ్వరరావు.

"నన్ను డేటింగ్‌కి వెళ్ళవద్దని అడగడానికి మీకు హక్కు లేదు డాడీ. మీరు ఇండియాలో బీఫ్, పోర్క్ తినేవారా? యిక్కడికి వచ్చి హాట్ డాగ్స్, బీఫ్ బర్గర్స్ తినడం లేదూ? అది మన సంప్రదాయమా? బయటనుంచి వచ్చిన మీరే అమెరికన్ ఫుడ్స్‌కి అడ్జస్ట్ అయ్యారే. మరి ఇక్కడ పుట్టి పెరిగిన నేను ఎందుకు అమెరికన్‌లా ప్రవర్తించకూడదు?"

కోపం చల్లా రాక ఒక్కసారిగా ఏడుపు తన్నుకు వచ్చింది.

"నేనెవర్ని? చెప్పండి, డాడీ. ఎవరిని నేను? నాకు తెలియని, మీ వల్ల తప్ప ఇతరత్రా నాకే మాత్రం సంబంధం లేని దేశాన్ని పదే పదే గుర్తుచేసి, నీవు ఇండియన్, నువ్వు ఇండియన్ అంటారు. యిక్కడ పుట్టి పెరిగిన నేను అమెరికన్‌లాకాక, ఎలా ఇండియన్‌లా ఫీలవగలను? నా అభిప్రాయాలను మీరు కంట్రోల్ చేయాలనుకోవడం దారుణం. నాకామాత్రం స్వతంత్రం ఉండకూడదా? హూ ది హెల్ ఏమ్ ఐ? హాఫ్ ఇండియన్? హాఫ్ అమెరికన్? అయామ్ నో బడీ"

లోపలకు పరుగెత్తుకెళ్ళింది వాణి. లక్ష్మి, వెంకటేశ్వరరావుల మొహాల్లో కొట్టొచ్చినట్లుగా కనిపించింది వాణి తమ చేజారిపోయిందన్న భయం.

వాణి కొద్ది క్షణాల తర్వాత చేత్తో పాస్‌పోర్ట్‌తో వచ్చి దాన్ని తండ్రి చేతిలో ఉంచి చెప్పింది.

"కమాన్ డాడ్ లుక్ ఇట్ ఫర్ యువర్ సెల్ఫ్. ఐయామ్ ఏన్ అమెరికన్. సుసాన్‌లా, జూడీలా, కేథీలా నేను అమెరికన్‌ని. మీరు ఇండియన్స్. కాబట్టి ఇండియన్స్‌లా జీవించండి. నేను అమెరికన్‌ని కాబట్టి నన్ను అమెరికన్‌లా జీవించండి. పెళ్ళిచూపులూ, అమ్మ చెప్పిన అబ్బాయిని తలవంచి పెళ్ళి చేసుకోవడాలూ నాకు సరిపడవు. ఐ డేట్, దెన్ ఐ డిసైడ్ ఫర్ మైసెల్ఫ్. హు ది హెల్ విల్ బి మై లైఫ్ పార్టనర్. గెటిట్ స్ట్రెయిట్ డాడీ! నాట్ యు, నాట్ మమ్ టు డిసైడ్ ఇట్స్ మై లైఫ్ అండ్ ఐ డు డిసైడ్ ఫర్ మై సెల్ఫ్."

నిశ్చేష్టులైన తల్లిదండ్రులతో చెప్పింది వాణి. "గెట్ దిస్ స్ట్రెయిట్ ఇన్ టు యువర్ నేరో మైండ్స్. వాణి ఈజ్ అమెరికన్."

తన గదిలోకి వెళ్ళి చప్పుడయ్యేలా తలుపు మూసుకుంది వాణి. లోపల గడియపెట్టుకుంది.

లక్ష్మి వెళ్ళి ఆ గది తలుపు తడితే అరిచింది. లోపల నుంచి ఏడుపు, కోపం కలిసిన కంఠంతో.

"లీవ్ మి ఎలోన్! ప్లీజ్. డు లీవ్ మి ఎలోన్. విల్ యూ?"

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**